"బ్రహ్మాబాబా యొక్క మరొక రెండు అడుగులు - ఆజ్ఞాకారీ, విశ్వాసపాత్రులు"

ఈ రోజు బాప్ దాదా నలువైపులా ఉన్న స్నేహీ మరియు సహయోగీ పిల్లలను మరియు శక్తిశాలిగా, సమానులుగా ఉండే పిల్లలను చూస్తున్నారు. పిల్లలందరూ స్నేహీలే కానీ శక్తిశాలిగా యథాశక్తి ఉన్నారు. స్నేహీ పిల్లలకు స్నేహానికి రిటర్న్ లో పదమాల రెట్ల స్నేహము మరియు సహయోగము ప్రాప్తిస్తుంది. శక్తిశాలిగా, సమానులుగా ఉన్న పిల్లలకు సదా సహజ విజయీ భవ అన్న రిటర్న్ లభిస్తుంది. లభించడమైతే అందరికీ లభిస్తుంది. స్నేహీ పిల్లలు యథా శక్తిశాలిగా ఉన్న కారణంగా సదా సహజ విజయాన్ని అనుభవం చేయలేకపోతారు. ఒక్కోసారి సహజంగా, ఒక్కోసారి శ్రమతో కూడినదిగా అనిపిస్తుంది. బాప్ దాదా స్నేహీ పిల్లలకు కూడా శ్రమను సహజతరం చేసేందుకు సహయోగాన్ని ఇస్తారు. ఎందుకంటే స్నేహీ ఆత్మలు సహయోగులుగా కూడా ఉంటారు. కావున సహయోగానికి రిటర్న్ లో బాప్ దాదా సహయోగాన్ని తప్పకుండా ఇస్తారు కానీ యోగము యథార్థముగా ఉండని కారణంగా సహయోగము లభిస్తున్నప్పటికీ ప్రాప్తిని అనుభవం చేయలేకపోతారు. యోగము ద్వారానే సహయోగము అనుభవమవుతుంది. మరియు శక్తిశాలిగా, సమానులుగా ఉన్న పిల్లలు సదా యోగయుక్తంగా ఉంటారు, అందుకే సహయోగాన్ని అనుభవం చేస్తూ సహజ విజయులుగా అవుతారు. కానీ, తండ్రికి ఇరువురు పిల్లలూ ప్రియమైనవారే. ప్రేమ మరియు సదా విజయులుగా ఉండే శుభమైన కోరిక పిల్లలందరిలోనూ ఉంటుంది కానీ శక్తి తక్కువగా ఉన్న కారణంగా సమయానికి సర్వ శక్తులను కార్యంలో వినియోగించలేకపోతారు. తండ్రి వారసత్వం యొక్క అధికారంగా సర్వ శక్తుల యొక్క అధికారాన్ని ఇవ్వడంలో బాప్ దాదా వ్యత్యాసం చూపించరు, అందరినీ సంపూర్ణ అధికారులుగా తయారుచేస్తారు కానీ తీసుకోవడంలో నంబరువారుగా అవుతారు. బాప్ దాదా ఎవరికైనా స్పెషల్ గా, వేరుగా ట్యూషన్ చెప్తారా? అలా చెప్పరు. చదువు అందరికీ ఒక్కటే, పాలన అందరికీ ఒక్కటే. పాండవులకు వేరే పాలన, శక్తులకు వేరే పాలన - ఇలా ఏమైనా ఉందా? అందరికీ ఒకే విధమైన పాలన మరియు చదువు ఉన్నాయి. కానీ దానిని తీసుకోవడంలో మరియు రిజల్టులో ఎంత తేడా ఉంటుంది! అష్ట రత్నాలు ఎక్కడ మరియు 16108 రత్నాలు ఎక్కడ - ఎంత తేడా ఉంది! ఈ వ్యత్యాసం ఎందుకు ఏర్పడింది. చదువును, పాలనను, వరదానాలను ధారణ చేయడము మరియు కార్యంలో వినియోగించడము - ఇందులో వ్యత్యాసం ఏర్పడుతుంది. చాలామంది పిల్లలు ధారణ కూడా చేస్తారు కానీ సమయమనుసారంగా కార్యంలో వినియోగించడం రాదు. బుద్ధి వరకు చాలా నిండుగా ఉంటారు కానీ కర్మలలోకి వచ్చేసరికి తేడా వచ్చేస్తుంది.

బ్రహ్మాబాబా నంబరు వన్ ఎందుకు అయ్యారు? రెండు అడుగులు ఇంతకుముందు వినిపించాము కదా! మూడవది - సదా తండ్రి, శిక్షకుడు మరియు సద్గురువుకు ఆజ్ఞాకారిగా అయ్యారు. ప్రతి ఆజ్ఞకు హాజీ, నేను హాజరై ఉన్నాను అని అన్నారు. తండ్రి ఆజ్ఞ ఏమిటంటే - సదా సర్వ ఖజానాల వారసత్వంలో సంపన్నంగా తయారవ్వాలి మరియు తయారుచేయాలి. ప్రత్యక్షంగా చూసినదేమిటంటే - సర్వ ఖజానాలను - జ్ఞానాన్ని, శక్తులను, గుణాలను, శ్రేష్ఠ సమయాన్ని, శ్రేష్ఠ సంకల్పాల ఖజానాను మొదటి రోజు నుండి చివరి రోజు వరకు కార్యంలో వినియోగించారు. చివరి రోజున కూడా సమయాన్ని, సంకల్పాలను పిల్లల కోసమే వినియోగించారు. జ్ఞానం యొక్క ఖజానాను, స్మృతి యొక్క శక్తిని మరియు సహనశీలతా గుణం యొక్క స్వరూపాన్ని - ఈ అన్ని ఖజానాలను చివరి సమయం వరకు శరీరాన్ని కూడా మరచి సేవలో ప్రాక్టికల్ గా వినియోగించి చూపించారు. ఇటువంటివారినే ఆజ్ఞాకారీ నంబరువన్ బిడ్డ అని అంటారు ఎందుకంటే తండ్రి యొక్క విశేషమైన ఆజ్ఞ ఏమిటంటే - స్మృతి మరియు సేవలో సదా తండ్రి సమానంగా ఉండండి. కావున ఆది నుండి మొదలుకొని అంతిమ ఘడియ వరకు ఈ రెండు ఆజ్ఞలను ప్రాక్టికల్ లోకి తీసుకురావడం చూసారు కదా? స్నేహానికి గుర్తు ఫాలో చేయడము. కావున చెక్ చేసుకోండి - ఆది నుండి ఇప్పటి వరకు సర్వ ఖజానాలను స్వయంతో పాటు సేవలో కూడా వినియోగించారా? తండ్రి ఆజ్ఞ ఏమిటంటే - ఒక్క శ్వాసను లేక ఒక్క సంకల్పాన్ని, ఒక్క క్షణాన్ని కూడా వ్యర్థంగా పోనివ్వద్దు. మరి రోజంతటిలో ఈ ఆజ్ఞను ప్రాక్టికల్ లోకి తీసుకొచ్చారా లేక ఒక్కోసారి తీసుకొచ్చారు, ఒక్కోసారి తీసుకురాలేదా? ఒకవేళ అప్పుడప్పుడు ఆజ్ఞాకారులుగా అయి మళ్ళీ అప్పుడప్పుడు అవ్వకుండా ఉంటే ఏ లిస్ట్ లోకి వెళ్తారు? ఒకవేళ బాప్ దాదా ఆజ్ఞాకారుల లిస్ట్ ను తయారుచేస్తే మీరు ఏ లిస్ట్ లో ఉంటారు? మీ గురించైతే మీకు తెలుసు కదా? ఎందుకంటే మీరందరూ సర్వ ఖజానాలకు ట్రస్టీలు, యజమానులు. కావున ఒక్క సంకల్పాన్ని కూడా తండ్రి ఆజ్ఞ లేకుండా ఉపయోగించలేరు. లేక ఇలా ఆలోచిస్తున్నారా -

మేము బాలకులము మరియు యజమానులము, అందుకే వ్యర్థంగా పోగొట్టినా లేక ఏం చేసినా ఇందులో తండ్రిది ఏం పోతుంది! తండ్రి ఇచ్చేసారు కదా, ఇప్పుడు లెక్క ఎందుకు అడుగుతున్నారు? అలా అనకూడదు. మీరు ప్రతి రోజు బాబా ఎదురుగా - సర్వస్వము మీదే, నాది కాదు అని అంటూ ఉంటారు కదా. అంటూ ఉంటారు కదా! లేక సమయం వచ్చినప్పుడు నాది, వేరే సమయంలో మీది అంటారా! నాకు అవసరమైనప్పుడు నాది, మామూలుగా అయితే మీది... ఇటువంటి చతురతనైతే చూపించడం లేదు కదా? బ్రహ్మాబాబాను చూసారు - తమ విశ్రాంతి సమయాన్ని కూడా విచార సాగర మథనం చేస్తూ పిల్లల కోసం వినియోగించారు. రాత్రివేళలో కూడా మేల్కొని పిల్లలకు యోగశక్తిని ఇస్తూ ఉండేవారు. ఈ చరిత్రనైతే విన్నారు కదా? బ్రహ్మా యొక్క జీవితగాథను విన్నారు కదా? మరి ఫాలో ఫాదర్ చేసారా లేక కేవలం విన్నారా? వినడము అంటే చేయడము.

కావున మూడవ అడుగు - సదా హాజరై ఉన్నాను అని అనడము, అప్పుడు ప్రభువు సదా హాజరై అన్నీ చూస్తారు. ఎప్పుడూ బ్రహ్మాబాబా నుండి శివబాబా వేరవ్వలేదు, సదా హాజరై అన్నీ చూస్తూ ఉండేవారు కదా! పిల్లలు, బాబా అని అన్నారు మరియు బాబా, మధురమైన పిల్లలూ అని అన్నారు. కావున మనసు యొక్క స్థితిలో - వారు సదా హాజరై అన్నీ చూస్తున్నారు అన్నట్లు అనుభవం చేసారు. బ్రహ్మాబాబా సేవలో - హాజీ, సదా హాజరై ఉన్నాను అని అన్నారు. అది రాత్రి అయినా, పగలు అయినా, సేవ యొక్క డైరెక్షన్ లభించగానే ప్రాక్టికల్ గా చేసారు మరియు కర్మలో సదా హాజీ అన్నారు. హాజీ పాఠాన్ని చదివించారు కదా? మరి మీరు ఏమి ఫాలో చేస్తున్నారు? ఒక్కోసారి హాజీ, ఒక్కోసారి నాజీ అని అనడం లేదు కదా? మరి ప్రేమకు ఋజువు చూపించండి. ఫాలో ఫాదర్ చేయడమే ఋజువు. కావున చెక్ చేసుకోండి - స్థితిలో, సేవలో, కర్మలో అనగా సంబంధ-సంపర్కంలో, (సంబంధ-సంపర్కంలోకి రావడమే కర్మ) - మూడింటిలోనూ సదా ఫాలో ఫాదర్ చేస్తున్నారా? ప్రతి ఆజ్ఞ కేవలం బుద్ధి వరకే ఉంటుందా లేక కర్మలోకి కూడా వస్తుందా? రిజల్టులో ఏం గమనించడం జరిగిందంటే - బుద్ధి మరియు వాణిలో 100 విషయాలు ఉన్నాయంటే కర్మలలో 50 ఉంటున్నాయి. మరి వారిని ఫాలో ఫాదర్ చేస్తున్నారు అని అంటారా? సగం-సగం రిజల్టు ఉన్నవారిని ఫాలో ఫాదర్ చేసే లిస్ట్ లో పెట్టాలా? మీరు ఏం అనుకుంటున్నారు? వారు ఆజ్ఞాకారులేనా? లేక మీరు సగానికే రాజీగా ఉన్నారా? కొద్ది-కొద్దిగా తేడా ఉంటే ఇష్టమేనా! ప్రారంభంలో మాలను కూడా తయారుచేసేవారు, బంగారము, వెండి అని లిస్ట్ లను కూడా తయారుచేసేవారు. మరి ఇప్పుడు మళ్ళీ లిస్ట్ తీయాలా? లేక వెండి లిస్ట్ లో తమ పేరును చూసి రాగిగా అయిపోతారా?

సమయం యొక్క సూచనను తండ్రి అయితే ఇస్తూనే ఉన్నారు, అంతేకాక ప్రకృతి కూడా ఇస్తూ ఉంది. ప్రకృతి కూడా ఛాలెంజ్ చేస్తూ ఉంది, అలాగే సమయమనుసారంగా మీరు ఇతరులకు కూడా సూచనలు ఇస్తూ ఉంటారు. భాషణ చేసేటప్పుడు - సమయం వచ్చేసింది, సమయం వచ్చేసింది అని అందరికీ చెప్తూ ఉంటారు. మరి ఇది మీకు కూడా చెప్పుకుంటున్నారా లేక కేవలం ఇతరులకే చెప్తున్నారా? ఇతరులకు చెప్పడం సహజం అనిపిస్తుంది కదా? కావున స్వయం కూడా ఈ ఛాలెంజ్ ను స్మృతిలోకి తెచ్చుకోండి. సమయమనుసారంగా మీ పురుషార్థం యొక్క వేగం ఎలా ఉంది? బాప్ దాదా ఒక విషయంలో లోలోపలే నవ్వుకుంటూ ఉంటారు. ఏ విషయంలో నవ్వుకుంటారు, తెలుసా? ఒకవైపు మెజారిటీ పిల్లలు అప్పుడప్పుడు ఒక్క క్షణం ఇలా ఆలోచిస్తారు - సమయం అనుసారంగా పురుషార్థంలో తీవ్రత ఉండాలి అని. మళ్ళీ ఇంకొకవైపు మాయ తన ప్రభావాన్ని చూపించినప్పుడు మరుక్షణం ఇలా ఆలోచిస్తారు - ఇదంతా నడుస్తూనే ఉంటుంది, మహారథుల విషయంలో కూడా ఎప్పటినుండో కొనసాగుతూ వస్తుంది అని. అప్పుడు బాప్ దాదా ఏమి చేస్తారు? కోపమైతే చేయరు కదా! చిరునవ్వు నవ్వుతారు. దీనికి విశేష కారణం ఏమిటంటే - సమయం ప్రతి సమయం పురుషార్థాన్ని చాలా సులభం చేసేసుకున్నారు, ఈజీ చేసేసుకున్నారు. స్వభావాన్ని ఈజీ చేసుకోరు, స్వభావంలో టైట్ గా ఉంటారు కానీ పురుషార్థంలో ఈజీ అయిపోతారు. మళ్ళీ ఇది సహజయోగం కదా అని అనుకుంటారు! కానీ జీవితంలో, పురుషార్థంలో ఈజీగా ఉండడాన్ని సహజయోగం అని అనరు ఎందుకంటే ఈజీగా ఉండడం ద్వారా శక్తులు మర్జ్ అయిపోతాయి, ఇమర్జ్ అవ్వవు. మీరందరూ మీ బ్రాహ్మణ జీవితంలోని ఆది సమయాన్ని గుర్తు తెచ్చుకోండి. ఆ సమయంలో పురుషార్థం ఎలా ఉంది? ఈజీ పురుషార్థం ఉందా లేక అటెన్షన్ తో కూడిన పురుషార్థం ఉందా? అటెన్షన్ తో కూడిన, ఉల్లాస-ఉత్సాహాలతో కూడిన పురుషార్థం ఉండేది మరియు ఇప్పుడేమో నిర్లక్ష్యం అనే డన్లప్ తలగడ మరియు పరుపు లభించాయి. సాధనాలు ఎక్కువ విశ్రాంతి ప్రియులుగా చేసేసాయి. కావున మీ ఆది పురుషార్థాన్ని, ఆది సేవను మరియు ఆదిలోని ఉల్లాస-ఉత్సాహాలను చెక్ చేసుకోండి - అవి ఎలా ఉండేవి? విశ్రాంతి ప్రియులుగా ఉండేవారా? (లేదు). మరి ఇప్పుడు కొద్ది-కొద్దిగా ఉన్నారా? సాధనాలు సేవ కోసం ఉన్నాయి, సాధనాలనేవి స్వయాన్ని విశ్రాంతి ప్రియులుగా చేసేందుకు లేవు. కావున ఇప్పుడు డన్లప్ తలగడను మరియు పరుపును తీసేయండి. పట్టపురాణులుగా-పట్టపురాజులుగా (నేలపై పడుకునే రాణులుగా, నేలపై పడుకునే

రాజులుగా) అవ్వండి. పడుకోవడం నేలపై పడుకున్నా కానీ స్థితి మహారాజు-మహారాణిలా ఉండాలి. చూడండి, ఆది సేవా సమయంలో సాధనాలు లేవు, కానీ సాధన ఎంత శ్రేష్ఠంగా ఉండేది. ఆ ఆదిలోని సాధనే ఈ వృద్ధినంతటినీ తీసుకొచ్చింది. కావున సాధన యొక్క బీజాన్ని విస్తారంలో దాచివేయకండి. విస్తారమైనప్పుడు బీజం దాగిపోతుంది. కావున సాధన బీజము, సాధనాలు విస్తారము. కావున సాధన అనే బీజాన్ని దాగిపోనివ్వకండి, ఇప్పుడు మళ్ళీ బీజాన్ని ప్రత్యక్షం చేయండి.

బాప్ దాదా ఈ సీజన్ లో మీకు పని ఇచ్చారు కానీ చేయలేదు. ఏం పని ఇచ్చారో గుర్తుందా? లేక కేవలం పుస్తకాలలో ఉండిపోయిందా! ఏం పని ఇవ్వడం జరిగిందంటే - అనంతమైన వైరాగ్య వృత్తి గురించి స్వయంతో కూడా చర్చించుకోండి మరియు పరస్పరంలో కూడా చర్చించండి మరియు ప్రాక్టికల్ గా ఈ సాధన యొక్క బీజాన్ని ప్రత్యక్షం చేయండి, మరి చేసారా? లేక కేవలం ఒకరోజు దాని గురించి డిబేట్ చేసి, వర్క్ షాప్ చేసేసాము కానీ కార్యంలోకి రాలేదు అన్నట్లు లేదు కదా. కావున వర్తమాన సమయం అనుసారంగా ఇప్పుడు మీ సేవను మరియు సేవా స్థానాల యొక్క దినచర్యను అనంతమైన వైరాగ్య వృత్తితో కూడినవిగా తయారుచేయండి. ప్రస్తుతం విశ్రాంతితో కూడిన దినచర్య మిక్స్ అయిపోయింది. ఈ నిర్లక్ష్యము శరీరానికి వచ్చే చిన్న-చిన్న వ్యాధులకు కూడా సాకులు చెప్పేలా చేస్తుంది. ఇంతకుముందు కూడా వ్యాధులు ఉండేవి కదా, కానీ సేవ యొక్క ఉల్లాసము వ్యాధులను మర్జ్ చేసేస్తుంది. ఎప్పుడైనా మీ మనసుకు ఇష్టమైన సేవ ఉంటే ఆ సమయంలో వ్యాధి గుర్తుకొస్తుందా? ఒకవేళ మీ ఇంఛార్జ్ అక్కయ్య - వద్దు, మీ ఆరోగ్యము బాగోలేదు, ఇతరులను చేయనివ్వండి అని అంటే మీరు చేయనిస్తారా? ఆ సమయంలో జ్వరము లేక తలనొప్పి ఎక్కడికి వెళ్ళిపోతాయి? అదే ఏ సేవ అయినా ఇష్టం లేనప్పుడు ఏమవుతుంది? తలనొప్పి కూడా వచ్చేస్తుంది, కడుపునొప్పి కూడా వచ్చేస్తుంది. ఇంతకుముందు వినిపించాము కదా - సాకులు చెప్పేటప్పుడు జ్వరం అని చెప్తే థర్మామీటర్ పెట్టండి అని టీచర్ అంటారు కానీ కడుపునొప్పికి మరియు తలనొప్పికి థర్మామీటర్ అయితే ఉండదు కదా! నిజానికి మూడ్ సరిగ్గా ఉండదు కానీ కడుపు నొప్పి అని చెప్తారు! కావున ఇవన్నీ నిర్లక్ష్యపు సాకులు. అనంతమైన వైరాగ్య వృత్తి మర్జ్ అయిపోయింది మరియు సాకులు ఇమర్జ్ అయ్యాయి.

పిల్లలందరూ ఎంతో స్నేహంతో మధుబన్ కు చేరుకున్నారని బాప్ దాదా చూసారు. కావున స్నేహం అయితే చూపించారు, అందుకు అభినందనలు. బాప్ దాదాకు కూడా పిల్లల సంతోషాన్ని చూసి సంతోషము కలుగుతుంది, కానీ ఇకపై ఏం చేయాలి? కేవలం మధుబన్ వరకు చేరుకోవాలా లేక స్నేహం యొక్క ఋజువును చూపించేందుకు ఫరిశ్తా రూపంలో వతనం వరకు చేరుకోవాలా? ఏం చేయాలి? మధుబన్ కు చేరుకున్నారు, దానికి అభినందనలు కానీ ఫరిశ్తాగా అయి వతనంలోకి ఎప్పుడు చేరుకుంటారు? నడుస్తూ-తిరుగుతూ మీ అందరినీ ఫరిశ్తాలుగానే చూడాలి. మీ మాట, నడవడిక, జీవనశైలి అంతా ఫరిశ్తాల వలె అయిపోవాలి. మరియు ఫరిశ్తా అంటేనే డబల్ లైట్. కావున దినచర్యలో లైట్ గా అవ్వకూడదు కానీ సంబంధ-సంపర్కాలలో, స్థితిలో లైట్ గా అవ్వాలి. మరి లైట్ గా అవ్వడం వస్తుందా లేక ఏదైనా భారము లాగుతుందా? బాప్ దాదా స్నేహం యొక్క ఋజువును చూడాలనుకుంటున్నారు మరియు ఎప్పుడైతే స్నేహం యొక్క ఋజువును ఇస్తారో, అప్పుడు మీరు చప్పట్లు కొట్టవలసిన అవసరం ఉండదు కానీ మాయ - వాహ్ విజయీ వాహ్ అని చప్పట్లు కొడుతుంది, ప్రకృతి కూడా చప్పట్లు కొడుతుంది. కావున ఇప్పుడు ఏదైనా పరివర్తన తీసుకురండి.

ఇప్పుడు స్వయాన్ని స్నేహం కలిగి ఉండడంతోపాటు శక్తిశాలిగా కూడా తయారుచేసుకోండి. స్వయం యొక్క పరివర్తనలో శక్తిరూపులుగా అవ్వండి. సహజయోగీ, సహజయోగీ అని అంటూ నిర్లక్ష్యాన్ని తీసుకురాకండి. స్వయం విషయంలో, సేవ విషయంలో మరియు ఇతరుల సంబంధ-సంపర్కాల విషయంలో నిర్లక్ష్యంలోకి ఎక్కువగా రావడాన్ని బాప్ దాదా చూసారు. అంతా నడుస్తుందిలే అని భావించకండి. ఒకరినొకరు కాపీ చేయకండి, బాబాను కాపీ చేయండి. ఇతరులను చూసే అలవాటు కాస్త ఎక్కువయ్యింది. స్వయాన్ని చూసుకోవడంలో నిర్లక్ష్యము వచ్చేసింది. బాప్ దాదా వినిపించారు కదా, దగ్గరి దృష్టి బలహీనమైపోయింది మరియు దూరపు దృష్టి తీవ్రమైపోయింది. మరి ఇప్పుడు ఏం చేస్తారు? ఈ సీజన్ యొక్క ఫలముగా ఏమిస్తారు? లేక కేవలం తండ్రి వచ్చారు, కలుసుకున్నారు, వేడుక జరుపుకున్నారు, మురళి విన్నారు - ఇదే ఫలమా? ప్రతి సీజన్ కు ఫలము ఉంటుంది కదా? మరి ఈ సీజన్ లో ఏ ఫలాన్ని బాప్ దాదాకు భోగ్ లో పెడతారు? భోగ్ పెట్టినప్పుడు భోగ్ ఫలాలను కూడా పెడతారు కదా. ఆ ఫలాలైతే బజార్లో దొరుకుతాయి, అదేమంత పెద్ద విషయం కాదు. ఇప్పుడు ఈ సీజన్ లో ఏ ఫలాన్ని కానుకగా సమర్పిస్తారు లేక భోగ్ పెడతారు? భోగ్ పెట్టాలా లేక ఇది కష్టమా? మరి నంబరు వన్ భోగ్ ఎక్కడి నుండి వస్తుందో చూద్దాము. ప్రతిజ్ఞలైతే చాలా

మంచిగా చేసి వెళ్ళారు. ఎప్పుడూ, కాదు అని అనరు, హాజీ అనే అంటారు, సంతోషపెడతారు. కానీ ఇప్పుడు ఏం చేస్తారు? టీచర్లు నంబరు వన్ భోగ్ పెడతారు కదా! ఇప్పుడు అందరి టీచర్ల భోగ్ ను చూస్తాము. ప్రవృత్తివారు కూడా భోగ్ పెడతారు కదా లేక మీకు మీరే తినేస్తారా? కావున ఇది కేవలం సెంటర్ వారి పని మాత్రమే అని ఆలోచించకండి. ఇది అందరి పని. కావున ఆజ్ఞాకారీ అన్న అడుగును ప్రాక్టికల్ లోకి తీసుకురావాలి.

నాలుగవ అడుగు - విశ్వాసపాత్రులుగా ఉండాలి. ఎప్పుడూ మనసు ద్వారా, బుద్ధి ద్వారా, సంకల్పాల ద్వారా తండ్రికి అవిశ్వాసపాత్రులుగా అవ్వకూడదు. విశ్వాసపాత్రుల అంటే అర్థము - సదా ఒక్క బాబా తప్ప మరెవ్వరూ లేకుండా ఉండడము. సంకల్పంలో కూడా దేహము, దేహ సంబంధాలు, దేహ పదార్థాలు లేక దేహధారీ వ్యక్తులు ఆకర్షించకూడదు. పతి-పత్ని ఒకరికొకరు విశ్వాసపాత్రులుగా అయినప్పుడు స్వప్నంలో ఇతరులు గుర్తుకువచ్చినా సరే దానిని విశ్వాసపాత్రత అని అనరు. బ్రహ్మాబాబాను చూసారు కదా! సంకల్పాలు కూడా ఇతరుల వైపు లేవు. ఒక్క బాబాయే సర్వస్వముగా ఉన్నారు, దీనినే విశ్వాసపాత్రత అని అంటారు. ఒకవేళ పదార్థాల ఆకర్షణ ఉన్నా, సాధనాల ఆకర్షణ ఉన్నా - సాధన ఖండితమైపోతుంది, విశ్వాసపాత్రత ఖండితమైపోతుంది. మరియు ఖండితులు ఎప్పుడూ సంపన్నంగా, పూజ్యులుగా గాయనం చేయబడరు. కావున సంకల్పంలో కూడా ఎటువంటి ఆకర్షణ అనేది అవిశ్వాసపాత్రులుగా చేయడం లేదు కదా అని చెక్ చేసుకోండి. కొద్దిగానైనా ఎవరి పట్లనైనా విశేషమైన ఆకర్షణ ఉంటే, కొద్దిగానైనా వ్యక్తిగత ఆకర్షణ ఉంటే, వారి గుణాల పట్లనైనా, సేవల పట్లనైనా, మంచి సంస్కారాల పట్లనైనా, కాస్త ఎక్ స్ట్రా ప్రభావితులైనట్లయితే వారిని విశ్వాసపాత్రులు అని అనరు. అందరి విశేషతలపై, అనంతమైన విశేషతలపై ఆకర్షితులవ్వడం, అది వేరే విషయము. కానీ ఒక విశేషమైన వ్యక్తి లేక వైభవం పట్ల ఆకర్షితులై ఉంటే వారి పేరు విశ్వాసపాత్రుల లిస్ట్ నుండి ఖండించబడింది అని అంటారు. కావున చెక్ చేసుకోండి - మేము ఖండితమూర్తులుగా అయితే లేము కదా? పూజ్యులుగా ఉన్నామా? మాకు ఎక్కడా ఎక్స్ ట్రా మోహము లేక ఆకర్షణ లేదు కదా. సంకల్పమాత్రంగా కూడా ఆకర్షణ ఉండకూడదు, ఇక వాచా, కర్మణా విషయాన్ని అయితే వదిలేయండి. సంకల్పమాత్రం ఉన్నా కూడా ఖండిత లిస్టులోకి వస్తారు. మరి చెక్ చేసుకోవడం వస్తుంది కదా? అచ్ఛా!

నలువైపులా ఉన్న స్నేహం యొక్క ఋజువును ఇచ్చే పిల్లలకు, ప్రతి ఆజ్ఞను సంకల్పాల్లోకి, మాటల్లోకి మరియు కర్మల్లోకి తీసుకువచ్చేవారికి, సదా స్వయాన్ని తండ్రి సమానంగా సింపుల్ గా మరియు శ్యాంపుల్ గా తయారుచేసుకునేవారికి, బ్రహ్మాబాబా యొక్క ప్రతి అడుగుపై అడుగువేసేవారికి, ఇటువంటి తండ్రి సమానంగా అయ్యే దృఢ సంకల్పం కలిగిన శక్తిశాలి పిల్లలందరికీ బాప్ దాదా యొక్క ప్రియస్మృతులు మరియు నమస్తే.

వరదానము:- సాక్షీ స్వరూప స్థితి ద్వారా హీరో పాత్రను అభినయించే సహజ పురుషార్థీ భవ

సాక్షీ స్వరూప స్థితి డ్రామాలో హీరో పాత్రను అభినయించడంలో సహయోగిగా అవుతుంది. ఒకవేళ సాక్షీ స్వరూప స్థితి లేకపోతే హీరో పాత్రను అభినయించలేరు. సాక్షీ స్వరూప స్థితి అనగా దేహం నుండి అతీతంగా ఆత్మ తన యజమానత్వపు స్థితిలో స్థితి అయి ఉండడము. దేహం నుండి కూడా అతీతంగా ఆత్మ సాక్షీగా, యజమానిగా ఉండడము. ఈ దేహముతో కర్మ చేయించే ఇటువంటి సాక్షీ స్థితియే సహజ పురుషార్థాన్ని అనుభవం చేయిస్తుంది. ఎందుకంటే ఈ స్థితిలో ఎటువంటి విఘ్నము లేక కష్టము రాదు. ఇదే ముఖ్యమైన అభ్యాసము, ఈ అభ్యాసము ద్వారానే చివరిలో విజయులుగా అవుతారు.

స్లోగన్:- ఫరిశ్తాగా అవ్వాలంటే మీ సర్వ సంబంధాలను ఒక్క ప్రభువుతో జోడించండి.